# 12. పాములూ చీమలూ!

మహారాజా సర్ భూపేంచర్‌సింగ్ పాటియాలా సంస్థానాన్ని పాలిస్తూన్న కాలంలో సర్దార్ బహదూర్ సర్ గుర్నాంసింగ్ ప్రధానమంత్రిగా సర్వాధికారాలతో సంస్థానాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలిస్తూండేవాడు.

గుర్నాంసింగ్ మొదట్లో ఓ సామాన్య రైతు. కాని, మహారాజా వారు ఈ పేదరైతు కుమార్తెనే మోహించి, వివాహమాడి, మహారాణిని చేసి, ఆమెవల్ల కలిగిన కుమారుడినే యువరాజుగా ప్రకటించటంతో గుర్నాంసింగ్ దశమారి పోయి క్రమలగా సంస్థానానికీ ప్రధానమంత్రే అయిపోయేడు.

గుర్నాంసింగ్ అంతటితో ఆకుండా సంస్థానంలోని కీలకమైన పదవులన్నింటా తనవారినే చేరుస్తూ తన అధికారాన్ని సుస్థిరం చేసుకుంటూ, పాలనా వ్యవహారాలలో చండశాసనుడనే కీర్తని గడించాడు.

మహారాజుకు అతను కేవలం మామగారనేగాక మంచి పాలనాదక్షుడనికూడా అపారగౌరవమూ, విశ్వాసమూను. దీనిని సద్వినియోగం చేసుకుని ప్రధాన మంత్రి అపారమైన ఆస్తిని పోగుచేసుకుని నగరంలో ఓ దివ్య హర్మ్యంలో రాజభోగాలలో తేలుతుండేవాడు

ప్రధాన మంత్రి మాటకు, తీర్పుకు సంస్థానంలో ఎదురులేదు. ఎదురాడిన వారిలో కొందరి ఉద్యోగాలూడాయి. మరి కొందరు జైలుపాలయ్యేరు. ఇంకొందరు అయిపు లేకుండాపోయేరు. శ్రీవారి వాక్కు రాచకార్యాల్లో వేదవాక్కే.

ఇలా ఉండగా అంతఃపురోద్యోగియైన సర్దార్ భూటారామ్ అనే ఓ "పొగరుబోతు"పై మహారాణీవారు కోపగించుకున్న, ఉద్యోగంనుండి తొలగించి, దిక్కున్నచోట చెప్పుకోమన్నారు.

న్యాయంగా మహారాణీవారి ఆగ్రహానికి గురయినవాడు ఉరేసుకొని చావనన్నా చావాలి, లేదా దేశం విడిచివెళ్ళి వేరే నౌకరీయయినా వెతుక్కోవాలి. కాని, ఈ భూటారామ్ అచ్చు భూతంలాంటి పట్టుగలవాడు. ముందు ఈ మహామంత్రి పలుకుబడిని పాతిపెడితే తర్వాత మహారాణీవారి "పొగరు" దానంతటదే దిగిపోతుందని అతనాలోచించాడు.

కానీ, అదంత తేలిక పనా! ఉద్యోగ భ్రష్టుడైన ఓ అనామకుడు సర్వాధికార సంపన్నుడైన మహామంత్రిని ఎదిరించి బ్రతకగలడా!

భూటారామ్ ఓ ప్లాను తయారుచేసి తన మిత్రులైన మహారాజావారి అంగరక్షకుడు కెప్టెన్ చంద్రసింగ్‌తోనూ, ఆస్థాన వైద్యుడైన కల్నల్ నిరంజనసింగ్‌తోనూ సమాలోచనలు చేశాడు. అసలే మహామంత్రి అంటే మంటగా ఉన్న వారందుకు శుభం పలికేరు.

మహారాజా వారికి తమ మహారాణులతోనూ, రాణులతోనూ గడపటానికే సమయం చాలేది కాదు కనుక, వారి దర్శనం మహామంత్రికి తప్ప మరెవరికీ దొరికేది కాదు, సంస్థానానికి సంబంధించిన సమస్త వ్యవహారాలూ మహామంత్రి ద్వారానే శ్రీవారి సమక్షానికి పోయేవి.

ప్రధాన మంత్రి గ్రామాంతరంలోనో, అనారోగ్యంతోనో ఉంటే తప్ప అనుదినం ఉదయం 11 గంటల వేళ మహారాజావారి దర్శనం చేసుకునేవారు.

యథావిధిని ఆ మరుసటిదినం ప్రధాన మంత్రి సర్దార్ బహదూర్ సర్ గుర్నాం సింహజీ వారు మహారాజావారి దర్శనాని కేగగా...

మహారాజా వారి అంగరక్షకుడు కెప్టెన్ చంద్రసింగ్ ఎదురై మహారాజావారి ఆరోగ్యం సరిగా లేదనీ, ప్రధాన మంత్రిని దర్శించజాల రనీ సెలవిచ్చేడు. ఆస్థానవైద్యుడు కల్నల్ నిరంజనసింగ్ తలూపేడు. దాంతో ప్రధాన మంత్రిగారు తిరుగుముఖం పట్టేరు.

ఇలా వరసగా ఓ పదిరోజులపాటు జరగటంతో మహామంత్రిగారు విసుగెత్తిపోయి, ఏలినవారికీ స్వస్థత చిక్కగానే తనకు కబురు చేయమని సెలవిచ్చి, మరి అటురావటం మానుకున్నారు.

ఇక్కడ మహారాజావారేమో ప్రధాన మంత్రి రాకపోవటానికి కారణ మేమని ప్రశ్నించగా, ఆ అంగరక్షక మహాశయుడు మహామంత్రి తీవ్ర అస్వస్థతతో మంచాన పడిఉన్నారని సెలవిచ్చాడు. అలా ఓ పదిరోజు లెదురుచూసి మహారాజావారు తన వైద్యుడైన కల్నల్ నిరంజనసింగ్‌ను మహామంత్రి ఆరోగ్యం పరీక్షించి రమ్మని పంపేరు.

రాజవైద్యుడున్నూ మహామంత్రిగారి దర్శనం చేసుకుని, మహా రాజావారి ఆరోగ్యం ఇంకా కుదుట పడలేదని సెలవిచ్చి, కాసేపు కుశల ప్రశ్నలాడి రాజభవనానికి తిరిగి వచ్చి.....

"మహామంత్రిగారి పరిస్థితి మరింత విషమించి ప్రస్తుతం వారు దాదాపు ఉన్మాదావస్థలో నున్నారు. ఏలినవారు కనీసం చూడదగని పరి స్థితి వారిది, మహాప్రభో!" అని మనవి చేసుకోగా, మహారాజావారు చింతించి, కాస్త కనిపెట్టి ఉండవలసిందిగా వైద్యులవారి నాదేశించారు.

ఇలా ఓ రెండుమాసాలు గడచిపోయాయి. మహామంత్రీ, అతని అంతరంగికులైన బహుకొద్ది మందీ ఇందులో ఏదైనా కుట్ర ఉన్నదేమోనని అనుమానించసాగారు. మహారాజావారి దర్శనం ఎలాగైనా సాధించాలని విశ్వప్రయత్నం చేశారు. కాని, మహారాజావారి ముఖ్య సేవకులందరూ

ఆదివరకే భూటారామ్ పక్షంలో చేరిపోయారు. దానితో మహారాజావారికి వాస్తవ పరిస్థితులు తెలిసే అవకాశమే లేకుండా పోయింది.

ఇదిలా ఉండగా మహారాజావారికీ, మహామంత్రికీ పడటం లేదనీ, అందుకే వారికి దర్శనం నిరాకరిస్తున్నారనీ, మహామంత్రికి ఉద్వాసన తథ్య మనీ రకరకాల పుకార్లు బయలుదేరాయి. దాంతో మహామంత్రి పట్ల భయంతో ఆయన అడుగులకు మడుగు లొత్తుతూన్న ఆ మిగిలిన కొద్ది మందీ కూడా వారికి దూరమయారు.

మహారాణీ వారేమో అసలీ విషయాలే తెలియని స్థితిలో ఉంచి వేయబడ్డారు.

మహామంత్రి ఉన్మాద స్థితిలో పడ్డారని తెలియగానే మహారాజా వారు కేవలం విచారించి ఊరుకోకుండా మహామంత్రిగారికి బరువు తగ్గిం చేందుకుగాను తాత్కాలికంగా నవాబ్ సర్ జుల్ఫికర్ అలీఖాన్‌గారిని ప్రధాన మంత్రిగా నియమించి మరలా రాసక్రీడలలో మునిగిపోయారు.

దానితో మహామంత్రి సర్ గుర్నాం సింహాజీవారు పిడుగుపాటు తిన్న వారిలా గిజ గిజలాడిపోయి క్రుంగిపోయారు. పదవి కాస్తా పోవ టంతో వారు ఏకాకులై పోయారు

మహారాజావారిని కలుసుకోవాలని చేసిన సకల యత్నాలూ వమ్మయిపోగా చివరికి వారో ఉపాయం ఆలోచించారు.

మహారాజావారు పాటియాలాకు 75 మైళ్ళ దూరంలో తరుచు వేటకు వెళ్తూండటం రివాజు. మహారాజావారి వెంట వందల సంఖ్యలో మిత్రులూ, ఉద్యోగులూ, పరిజనులూ కూడా వెళ్తూంటారు. వారు అంత పురం వదలి బయటకు వచ్చేది మామూలు పరిస్థితుల్లో ఆ ఒక్క సంద

ర్భంలోనే. కనుక ఆ వేట సమయంలో తప్ప మహారాజావారిని దర్శించు కునేందుకు మరో అవకాశం లేదని మహామంత్రికి స్పష్టమై పోయింది.

మహారాజావారు వేటకు బయలుదేరుతున్నారనగానే మహామంత్రి అత్యంత విశ్వాసపాత్రుల నిద్దరిని తోడు దీసుకుని అత్యంత రహస్యంగా ఆ వేటప్రాంతాలకు చేరి రైతుల వేషంలో ఓ కుగ్రామంలో మకాం చేశారు. మహారాజావారు వేటనుండి తిరిగివచ్చే సమయంలో దారిలో అకస్మాత్తుగా ఎదురై తన విన్నపాలను తెలుపుకోవాలని ఆతని ప్లాను. అందుకు తగినట్టే మహారాజావారు వేట పూర్తి చేసుకుని తిరిగివచ్చే సమయానికి దారిలో రోడ్డు ప్రక్కనే ఉన్న ఓ పెద్ద వృక్షాన్నధిరోహించి అనుచరులతోపాటు ఎవరికీ కనపడని రీతిలో కొమ్మల చాటున దాగి వేచి ఉన్నారు.

కాని, సర్దార్ భూటారామ్ మనుషులు మహామంత్రి రాజధానిలో లేరనేది ఎలాగో కనిపెట్టేసి ఆ విషయాన్ని మహారాజావారి వెంటనున్న కల్నల్ నిరంజనసింగ్, కాప్టెన్ చంద్రసింగ్ లకు కబురుచేశారు. దాంతో వారు మహామంత్రిగారి ఎత్తుగడలను కొంతవరకూ గ్రహించగలిగారు. వారూ తమ జాగ్రత్తలో తాముండి మహారాజావారు తిరుగు ప్రయాణానికై బయలుదేరుతూండగా...

మహామంత్రిగారు పిచ్చాస్పత్రినుండి తప్పించుకుపోయి వచ్చి ఈ ప్రాంతాలలోనే తిరుగుతూన్నారనీ, మహారాజా వారిని ఎదుర్కొనే ఉద్దేశ్యంలో ఉన్నారనీ, కనుక ఎక్కడేనా ఎదురయినా ఆగవద్దనీ, పలకరించవద్దనీ హెచ్చరించారు.

మహారాజావారున్నూ భయపడినవారై తలూపేరు. మహారాజావారి కారు డ్రైవర్లకూ, అంగరక్షకులకూ తగిన ఆదేశాలివ్వబడినాయి,

మహారాజావారి కారు దగ్గరకు రాగానే మహామంత్రీ, అతని అను

చరులిద్దరూ అమాంతం చెట్లమీదినుండి దూకారు. మహామంత్రిగారు కారు వెంట పరుగెత్తుతూ "మహారాజా! నేను నిక్షేపంలా ఉన్నాను. ఇదంతా కుట్ర!" అంటూ ఎలుగెత్తి కేకలేశారు.

కాని, ఈ ఉన్మాద లక్షణాలను గురించి ముందే హెచ్చరించబడి ఉన్న మహారాజావారు అవేవీ వినక కారు వేగం మరింత హెచ్చించవలసిందిగా ఆజ్ఞాపించి ప్రక్కనే ఉన్న ఆస్థాన వైద్యునితో, మహామంత్రిని పట్టుకుని తక్షణం పిచ్చాసుపత్రిలో చేర్పించి, సకల సౌకర్యాలూ కల్పించవలసిందిగా ఫర్మానా జారీచేశారు.

ఆ ఫర్మానా వెంటనే అమలుపరచబడింది. మహామంత్రిగారి అనుచరులిద్దరికీ హత్యా ప్రయత్నాభియోగంపై తలా పధ్నాలుగేళ్ళ కఠిన కారాగారవాసం లభ్యమయింది.

పిచ్చాసుపత్రిలో ఖైదు చేయబడిన మహామంత్రి సర్దార్ సర్ బహదూర్ గుర్నాం సింహజీవారికి అనతి కాలంలోనే నిజంగానే పిచ్చెక్కిపోయింది. అది వారిని జీవితాంతం వదలనే లేదు.

★